క్లుప్తంగా

40 మందికి కంటి పరీక్షలు

కపిలేశ్వరపురం: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా మండలంలోని వెదురుమూడిలో సోమవారం 40 మందికి కంటి పరీక్షలు చేశారు. పారా మెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు పరీక్షలు చేసి 25 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. నలుగురికి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరాన్ని వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, సర్పంచ్ చోడే రామతులసి, వైఎస్సార్ సీపీ నాయకులు చోడే సూరిబాబు, వెంకటేశ్వరరావు సందర్శించారు. వైద్య ఆరోగ్య కార్యకర్తలు అనంతలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, ఆశ కార్యకర్తలు నాగరత్నం, రత్నకుమారి సేవలందించారు.

యాగశాల నిర్మాణానికి రాట ముహూర్త పూజలు



కోరుమిల్లిలో యాగశాల నిర్మాణానికి రాట ముహూర్త పూజలు చేస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలో గౌతమి గోదావరి ఒడ్డున కొత్తగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. యాగశాల నిర్మాణానికి సోమవారం రాట ముహూర్త పూజలు చేశారు. పీటలపై కూర్చున్న సుంకర శ్రీనివాస్, లక్ష్మీ దుర్గ దంపతులచే వేద పండితుడు పెదపూడి సీతారామం ఆధ్వర్యంలో పండితులు పూజలు చేయించారు. కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ మే 9 నుంచి మూడు రోజుల పాటు ఆలయ ప్రతిష్ఠ పూజలు కొనసాగుతాయన్నారు. 11న అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి, శ్రీధర్ దంపతులు

రామచంద్రపురం: పట్టణంలోని ప్రధాన రహదారిలో షిరిడీ సాయి కోదండ రామాలయం వద్ద విశ్వ చైతన్య శక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్ చేతుల మీదుగా ప్రారంభించారు. చలివేంద్రం మొదటి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పడాల విజయ నాగ గంగాధర్, అక్కిరెడ్డి శ్రీను, గోపి, వినయ్, సాయి, బాబీ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లు జట్టు కార్మికుల ధర్నా



ఆర్డీఓ సింధుసుబ్రహ్మణ్యానికి వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాలు, కార్మిక నాయకులు

రామచంద్రపురం: స్థానిక డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో రైస్ మిల్లు జట్టు కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు జరిగేలా ఆర్డీఓ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్డీఓ పి.సింధుసుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, వెంటపల్లి భీమశంకరం, సాకా నాగార్జున, రైస్ మిల్లు కార్మిక నాయకులు గునిశెట్టి నాగేశ్వరరావు, సూరంపూడి గంగరాజు, కొప్పిశెట్టి రాంబాబు, కంబాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యంపై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఎలా రక్షించుకోవాలో రైతులకు అవగాహన అవసరమని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని అంగర, కపిలేశ్వరపురం తదితర 17 గ్రామాల్లోని వరి పంటలను సోమవారం ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఏఓ రమేష్‌కుమార్‌లు సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ సూర్యారావు, ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తడిసిన ధాన్యం వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఏఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రెండు రోజుల పాటు వరి కోతలను వాయిదా వేసుకోవడం మేలన్నారు. కోసిన పనులు వర్షానికి తడిస్తే వాటిని విశాలంగా ఆరబెట్టాలని సూచించారు. ఒక లీటరు నీటికి 20 గ్రాముల కళ్లు ఉప్పు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా తడిసిన ధాన్యం మొలక రాకుండా నివారించవచ్చన్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని మొత్తం ఆరే వరకూ తార్పాలిన్లు కప్పి భద్రపర్చుకోవాలని ఏఓ రమేష్‌కుమార్ సూచించారు.

ఊరగాయల సందడి

- మామిడికాయలకు గిరాకీ
- కాపు తగ్గుదలతో పెరిగిన ధరలు
- మండపేటలో రోజుకు రూ.4 లక్షల వరకూ వ్యాపారం



మండపేట మార్కెట్‌లో పచ్చడి మామిడి కాయల విక్రయాలు



కొత్తపల్లి కొబ్బరి



పెద్ద రసాలు



ముక్కలు కోయిస్తున్న దృశ్యం

మండపేట: వేసవి ఎండలు ముదురుతున్న వేళ ఊరగాయల సందడి జోరందుకుంటోంది. పచ్చళ్ల తయారీకి వినియోగించే మామిడి రకాలు చాగల్నాడు, మెట్ట ప్రాంతాల నుంచి ఈ ప్రాంత మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. తొలకరి జల్లుల నాటికి నోరూరించే ఊరగాయలు సిద్ధం చేసే పనిలో వినియోగదారులు ఉన్నారు. ధర ఎక్కువగా ఉన్నా మామిడికాయల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

జిహ్వాకు వహ్వా అనిపించే ఆవకాయ, మాగాయ తదితర పచ్చళ్లు అంటే అందరూ ఇష్టపడతారు. కూర లేకపోయినా పర్వాలేదు నాలుగు పచ్చడి మెతుకులు తినొచ్చులే అనే వారు చాలా మంది ఉంటారు. పచ్చళ్ల సీజన్ కావడంతో ఎక్కడ చూసినా మామిడి కాయలతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. ఆవకాయకు వినియోగించే కొత్తపల్లి కొబ్బరి, సువర్ణరేఖ, దేశవాళీ రకాలతో పాటు మాగాయికి చెరుకు రసాలు, పెద్ద రసాల మామిడి కాయలను వ్యాపారులు మార్కెట్లకు తరలిస్తున్నారు. ఈ ఏడాది కాపు పెద్దగా లేకపోవడంతో మామిడి ధరలు పెరిగిపోయాయి. ఊరగాయలకు అధికంగా వినియోగించే కొత్తపల్లి కొబ్బరి, రసాల రకాలు ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. పచ్చళ్లకు ముదర కాయలు బాగుంటాయన్న ఉద్దేశంతో వినియోగదారులు అలాంటి కాయల కొనుగోలుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అవసరాన్ని బట్టి కాయలు టోకుగా మాట్లాడుకుని ఖరీదు చేస్తున్నారు. ఊరగాయలకు మామిడికాయలు కొనుగోలు చేసేందుకు పరిసర గ్రామాల నుంచి వస్తున్న వారితో మండపేట మార్కెట్ కిటకిటలాడుతోంది. ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు మామిడికాయల అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ మూడు గంటల సమయంలోనే దాదాపు రూ.మూడు లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వరకూ వ్యాపారం జరుగుతోందని అంచనా. చాగల్నాడు ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో వ్యాపారులు ఆయా రకాల మామిడికాయలను మండపేటలోని కలువపువ్వు సెంటర్ సమీపంలో రోడ్డుపై ఉంచి అమ్మకాలు విక్రయిస్తున్నారు. కొత్తపల్లి కొబ్బరి వంద కాయలు కాయ సైజును బట్టి రూ.1200 నుంచి రూ.1,600 ధర పలుకుతుండగా, పెద్ద రసాలు రూ.800 నుంచి రూ.1000 వరకు, రసాలు రూ.700 నుంచి రూ. 900ల వరకు, సువర్ణరేఖ, దేశవాళీ రకాల కాయలు రూ. 600 నుంచి రూ. 800ల వరకు ఉన్నాయి. ధరలు ఎక్కువగా ఉన్నా లెక్కచేయకుండా కాయల కొనుగోలుకు వినియోగదారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. తర్వాత వాటిని తమకు కావాల్సిన సైజులో ముక్కలు కోయించుకుని ఇళ్లకు తీసుకువెళుతున్నారు.

పచ్చిరొట్టతో భూసారం

కాజులూరు: పచ్చి రొట్ట ఎరువుల సాగుతో భూసారం వృద్ధి చెందుతుందని డెల్టాలో రబీ సాగు అనంతరం మూడో పంటగా పచ్చి రొట్ట వేయాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచిస్తున్నారు. సోమవారం కాజులూరులో ఆయన రైతులతో మాట్లాడుతూ డెల్టాలో కొందరు రైతులు దాళ్వా సాగు అనంతరం అపరాల సాగు చేపట్టగా కొందరు దాళ్వా మాసూళ్లు ఆలస్యం కావడంతో పొలాలను కాలిగానే వదలి వేస్తున్నారన్నారు. అయితే పెసర, మినుము వంటి అపరాల సాగుకు అవకాశంలేని పొలాల్లో రైతులు జీలుగా, పిల్లిపెసరా, జనుము వంటి పచ్చి రొట్ట ఎరువుల సాగు చేపడితే భూసారం పెరుగుతుందన్నారు. పచ్చి రొట్ట ఎరువుల సాగు వల్ల రైజోబ్యూమ్ అనే బ్యాక్టీరియా వృద్ధి చెంది భూసారం పెరుగుతుందని పచ్చి రొట్ట మొక్క వేళ్ల నుంచి నత్రజని భూమిలో చేరుతుందన్నారు.

రేపు మండల సమావేశం

రామచంద్రపురం రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్నట్లు రామచంద్రపురం ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



దంగేరు సొసైటీ వద్ద ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రం



కందులపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, మండల పరిషత్ విప్ కొప్పిశెట్టి లక్ష్మణ్ సూచించారు. దంగేరు గ్రామంలో సొసైటీ వద్ద సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి రైతుకు గిట్టుబాటు ధర సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. వ్యవసాయ సలహాయకులు శ్రీరామచంద్రమూర్తి, సీఈఓ పద్మ, ఉప సర్పంచ్ దారా సత్యనారాయణ,రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రామచంద్రపురం రూరల్: కందులపాలెంలో రైతు భరోసా కేంద్రం వద్ద గ్రామ సర్పంచ్ పెంకే కృష్ణవేణి, ఎంపీపీటీసీ గుత్తుల అచ్యుతవేణి, సొసైటీ చైర్మన్ గీసాల జగదీశ్వరరావు(శివ)ల చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ శివ మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మకాలు జరగాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ పెంకే వీర్రాఘవులు, గుత్తుల శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

● కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న భూదాన బోర్డు చైర్మన్ తాడి విజయభాస్కర్‌రెడ్డి. చిత్రంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్

చలో తాడేపల్లి విజయవంతం చేయాలి

రామచంద్రపురం: తాడేపల్లిలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న సీఎం జగన్‌కు నాయీబ్రాహ్మణ కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయీబ్రాహ్మణ సేవా సంఘం కార్యనిర్వాహణ కార్యదర్శి బైలపూడి రామకృష్ణ, రామచంద్రపురం పట్టణ అధ్యక్షుడు ముచ్చుమిల్లి దుర్గాప్రసాద్, రామచంద్రపురం రూరల్ అధ్యక్షుడు తీపర్తి లక్ష్మీనారాయణ తెలిపారు. గత పాలకుడు చంద్రబాబునాయుడు మీ తోకలు కత్తిరిస్తా, మిమ్మల్ని గుడిమెట్లు ఎక్కనివ్వనని బెదిరిస్తే..ప్రస్తుత పాలకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలతో సహా అన్ని దేవాలయాల్లో పాలక మండలిలో స్థానం కల్పించారన్నారు. ఏటా జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించడంతో పాటు 150 యూనిట్లు వరకూ ఉచిత విద్యుత్ అందిస్తున్నారన్నారు. జీఓ నెం.50 ద్వారా కులాన్ని కించపరిచే పదాలను నిషేధించి చట్టబద్ధమైన రక్షణ కవచం అందించారన్నారు. ఈ సందర్భంగా జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

పారదర్శక పాలనకే సామాజిక తనిఖీ



హెచ్ఎంలకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రామచంద్రరావు, డీఆర్పీలు

మండపేట: పాఠశాలల్లో జరిగే కార్యక్రమాలను తల్లిదండ్రులకు తెలియజేయడం అనేది సామాజిక తనిఖీ ముఖ్య ఉద్దేశమని మండపేట ఎంఈవో నాయుడు రామచంద్రరావు తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీ యాప్‌పై హెచ్ఎంలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఎంఈవో రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో మన బడి నాడు-నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక తదితర ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ప్రతి విషయాన్ని పారదర్శకతతో తల్లిదండ్రులకు తెలియజేయడం కోసం ప్రభుత్వం సోషల్ ఆడిట్‌ను తల్లిదండ్రులకు తెలియజేస్తుందన్నారు. ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ సామాజిక తనిఖీ యాప్‌పై హెచ్ఎంలు అవగాహన పెంచుకుని, తల్లిదండ్రుల కమిటీలకు కూడా అవగగాహన కల్పించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్స్ ఎ.లక్ష్మీనారాయణ, జి.గోవిందరాజులు సోషల్ ఆడిట్ యాప్‌పై అవగాహనపై శిక్షణనిచ్చారు. యాప్ ప్రధాన ఉద్దేశం, యాప్‌ను ఏ విధంగా రిజిస్టర్ చేసుకోవాలి? యాప్‌లో నమోదు తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. సమావేశంలో ఏఎంవో(ఉర్దూ) ఖాజా మొయినుద్దీన్, సీఆర్పీలు రామభద్రరావు, శేషారావు, నారాయణరావు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయ సాధనకు జగనన్న కృషి



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్ ఆరిఫ్, కార్యదర్శి శ్రీనివాసరావు



కె.గంగవరంలో అవార్డులు అందిస్తున్న ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ శ్రీవరలక్ష్మి



రాయవరంలో సర్పంచులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీడీవో

కాజులూరు: పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని గ్రామాల అభివృద్ధితోనే దేశం పురోగతి సాధిస్తుందన్న జాతిపిత మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగనేత, గొల్లపాలెం గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక అన్నారు. సోమవారం పలు గ్రామ సచివాలయాల్లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని అధికారులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. గొల్లపాలెం సచివాలయం-1లో పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ ప్రసన్నమౌనిక మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయం, వలంటీరు వ్యవస్థల ద్వారా ప్రభుత్వం పాలన ప్రజలకు మరింత చేరువైందన్నారు. ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు అంగర శ్రీనివాస్‌గౌడ్, రేఖపల్లి సత్తిబాబు, కార్యదర్శి జహంగీర్, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కె.గంగవరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ ఎస్. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సహకారం అందిస్తున్నాయన్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీలు అభివృద్ధి చెందితేనే ఆ గ్రామంలో మెరుగైన పరిస్థితులు నెలకొంటాయన్నారు. అనంతరం సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పంచాయతీరాజ్ వ్యవస్థ ఆవశ్యకతపై ర్యాలీలు నిర్వహించి పంచాయతీలకు వెన్నుముకలైన పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. మండల స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి వారికి అవార్డులు అందించారు. ఈఓపీఆర్డీ నాగేంద్ర, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో గ్రామాలు

మండపేట: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తున్నాయని వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఐ.రాజు అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవార్డులు సాధించిన పంచాయతీ సర్పంచులను ఘనంగా సత్కరించారు. మహిళ స్నేహ పూర్వక పంచాయతీగా అర్తమూరు, పేదరికం లేని మెరుగైన జీవనోపాదుల పంచాయతీగా మారేడుబాక, పరిశుభ్రమైన, హరిత పంచాయతీలుగా వై.సీతానగరం, జెడ్. మేడపాడు, ఆరోగ్యకరమైన పంచాయతీలుగా మారేడుబాక, పాలతోడు, సామాజిక భద్రత కలిగిన పంచాయతీలుగా ద్వారపూడి, తాపేశ్వరం, సుపరిపాలన గల పంచాయతీగా ఏడిద, నీటి సమృద్ధి కలిగిన పంచాయతీగా వెలగతోడు, స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు గల పంచాయతీగా కేశవరం, పిల్లల స్నేహపూర్వక పంచాయతీగా ఇప్పనపాడు అవార్డులు గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ నాగబాబు, ఎంపీడీఓ ఐ. రాజులు ఆయా పంచాయతీల సర్పంచులకు అవార్డులను అందజేసి సత్కరించారు. పరిపాలన అధికారి వీఎస్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భాగ్యరాజ్, గ్రామ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్ని పంచాయతీల్లో సోమవారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభ లు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగం లైవ్ టెలికాస్ట్‌ను ప్రదర్శించారు. పంచాయతీ రాజ్ ఉద్యోగులను పాలకవర్గాలు సత్కరించాయి.

26న మండల స్థాయిలో..

ఈ నెల 26న మధ్యాహ్నం 2.30 గంటలకు మండల స్థాయిలో పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీలకు ఆ రోజు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

సంతృప్తికర సేవలే అవార్డులకు కొలమానం

రాయవరం: గ్రామాల్లో ప్రజలకు సంతృప్తికరమైన సేవలే అవార్డులకు కొలమానంగా నిలుస్తాయని జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకరటమణ అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో డి.శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. వారిద్దరూ మాట్లాడుతూ దేశానికి పంచాయతీలు పట్టుకొమ్ములుగా నిలుస్తాయన్న జాతిపిత మహాత్మాగాంధీ కలలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేస్తున్నారన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఏటా వివిధ అంశాల్లో పంచాయతీలు సాధించిన ప్రగతిని పరిగణనలోకి తీసుకుని, పంచాయతీలకు అవార్డులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రదానం చేస్తున్నాయన్నారు. అనంతరం రాయవరం, లొల్ల, సోమేశ్వరం, నదురుబాద, మాచవరం, పసలపూడి, చెల్లూరు, కురకాళ్లపల్లి, కూర్మాపురం పంచాయతీ సర్పంచులు చంద్రమళ్ల రామకృష్ణ, చాట్రాతి జానకి, ఆరిఫ్, చింతపల్లి శ్రీనివాసరావు, కత్తుల సీతామహాలక్ష్మి, కడలి పద్మావతి, పాలిక రాఘవ, పిల్లి శారద, చౌటుపల్లి చక్రవేణిలను ఆయా పంచాయతీల ఉప సర్పంచులను దుశ్శాలువాతో సత్కరించి, సర్టిఫికెట్, మెమెంటోలు అందజేశారు. తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు, అధికారులు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మూడు అవార్డులు గెల్చుకున్న సోమేశ్వరం

రాయవరం: కేంద్ర ప్రభుత్వం సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా పాలన సాగించిన 'సోమేశ్వరం' పంచాయతీ మూడు విభాగాల్లో అవార్డులు కైవసం చేసుకుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఆరోగ్యకరమైన వాతావరణం, నీటి సమృద్ధి, పచ్చదనం, పరిశుభ్రత అంశాల్లో ఆ పంచాయతీ ఈ అవార్డులను గెలుచుకుంది. అలాగే రాయవరం మండలంలో తొమ్మిది కేటగిరీల్లో భాగంగా ఎనిమిది అవార్డులతో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన ప్రథమ స్థానంలో నిలిచింది. సోమవారం అమలాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా సర్పంచ్ ఆరిఫ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆరిఫ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కె.గంగవరం: పామర్రు గ్రామానికి చెందిన మట్టపర్తి ఆనంద్‌కుమార్ ఇటీవల కూళ్ల గ్రామంలోని గౌతమి నది గోదావరిలో స్నానానికి దిగి మృతి చెందాడు. ఆనందర్‌కుమార్ కుటుంబ సభ్యులను సోమవారం నియోజకవర్గ శెట్టిబలజ నాయకులు మేడిశెట్టి శేషారావు, కాజులూరు మండల శెట్టిబలజ సంఘం అధ్యక్షులు పెంకే విశ్వేశ్వరరావు, కోట శ్రీను, వాసంశెట్టి సూరిబాబు తదితరులు పరామర్శించి, సానుభూతి తెలిపారు.

శ్రీరావులమ్మబూరెల సారె

ఆలమూరు: సంధిపూడిలో ఉన్న శ్రీరావులమ్మ అమ్మవారికి బూరెల (పోలి) సారి సమర్పణ జరిగింది. అమ్మవారి తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు సుమారు పది వేల బూరెలను అమ్మవారికి సారెగా నైవేద్యంగా సమర్పించారు. తొలుత మహిళలు బూరెలు నింపిన బిందెలతో అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని సారిని భక్తులకు పంపిణీ చేశారు. శ్రీరావులమ్మ అమ్మవారి వార్షిక వేడుకలను పురస్కరించుకుని భారీ అన్నసమారాధన జరిగింది.

నేడు దేవస్థానం భూమి కౌలు హక్కుల వేలం

కాజులూరు: గొల్లపాలెంలో పురాణ ప్రశిద్ధి గాంచిన బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 7.75 ఎకరాల సాగు భూమి కౌలుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వీఆర్వో ఈశ్వరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో మూడేళ్ల కాలపరిమితికి గాను వేలం జరుగుతుందని. ఆసక్తి ఉన్న రైతులు రూ.30 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చునన్నారు.

ప్రజాదరణను చూసి ఓర్వలేకనే దాడి

మండపేట: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడికు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక యర్రగొండపాలెంలో అధికార పార్టీ నాయకులు ఆయన కాన్వాయ్‌పై దాడి చేశారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. గతంలో ఎప్పుడు ఇటువంటి ఘటనలు చోటుచే సుకోలేదని సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తాళ్లపాలంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



తాళ్లపాలంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు

రామచంద్రపురం రూరల్: తాళ్లపాలంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం కృత్తివెంటి పేర్రాజు పంతులు ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కట్టా గోవిందు ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ చిన్నబ్బాయి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, ఉప సర్పంచ్ వల్లు శివ, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.